క్లుప్తంగా

ఇన్‌చార్జి ఎంపీడీవోగా జాన్ లింకన్

మాకవరపాలెం: ఇన్‌చార్జి ఎంపీడీవోగా జాన్ లింకన్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు మాకవరపాలెం ఎంపీడీవోగా ఈవోపీఆర్డీ సీతామహాలక్ష్మి ఇన్‌చార్జిగా పనిచేశారు. ఎన్నికల నేపథ్యంలో నర్సీపట్నం ఎంపీడీవో జాన్‌లింకన్‌కు ఇక్కడ ఇన్‌చార్జిగా నియమించారు. ఈయన్ను ఈవోపీఆర్డీతోపాటు పంచాయతీ కార్యదర్శులు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఆలయంలో భారీ రేకుల షెడ్డు నిర్మాణం

- దాతకు పలువురి అభినందనలు



సంతోష్ విజయ దంపతులు నిర్మించిన భారీ ఇనుప షెడ్డు

రావికమతం: కొత్తకోటలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆ గ్రామానికి చెందిన గుమ్ముడు సంతోష్, విజయ దంపతులు రూ.2 లక్షలతో భారీ ఇనుప షెడ్డును భక్తుల సౌకర్యార్థం నిర్మించారు. ఆలయంలో నిత్యం ప్రత్యేక భక్తి కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఇక్కడికి వచ్చే భక్తులు ఎండకు, వర్షానికి ఇబ్బందులు పడుతుండటంతో గ్రామానికి చెందిన సంతోష్ దంపతులు షెడ్డును నిర్మించి ఆలయ కమిటీ నుంచి అభినందనలు అందుకున్నారు.

జిల్లా స్థాయి ఎడ్ల బళ్ల పరుగు పోటీలు



స్వామివారి ఆలయం

రావికమతం: కొత్తకోటలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి ఆలయ తీర్థ మహోత్సవం మంగళవారం నిర్వహిస్తున్నట్టు ఉత్సవ కమిటీ సభ్యు లు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద ఆ రోజు మధ్యాహ్నం నుంచి జిల్లా స్థాయి ఎడ్ల బళ్ల పరుగు పందేలు, రంగవల్లులు, షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తామన్నారు. ఉదయం నుంచీ ఆలయంలో ప్రత్యేక పూజాధికార్యక్రమాలతోపాటు రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన ఉంటుందని తెలిపారు.

ఈవీఎంలపై అవగాహన నేడు

రావికమతం: మండలంలో చీమలపాడు, ములకలాపల్లి పోలింగ్ బూత్‌ల్లో మంగళవారం ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తహసీల్దార్ రమణారావు సోమవారం తెలిపారు. ఇందులో భాగంగా ఓటు వేసే పద్ధతి, ఎవ్వరికి వేశామో తెలుసుకునే విధానంపై వివరిస్తామన్నారు.

ఈ- క్రాప్ నమోదు గడువు 15



పోతనపూడిలో ఈ -క్రాప్ నమోదు పరిశీలిస్తున్న ఏవో వాసుదేవరావు

మాడుగుల: ఈ- క్రాప్ నమోదు గడువు ఈ నెల 15వ తేదీతో పూర్తి కానుందని వ్యవసాయాధికారి ఎం.వాసుదేవరావు తెలిపారు. సోమవారం ఆయన పోతనపూడిలో ఈ-క్రాప్ నమోదును పరిశీలించి మాట్లాడారు. మండలంలో రబీ సాగుకు సంబంధించి రెండు వేల ఎకరాలకుగాను ఇంతవరకు 1,350 ఎకరాలకు ఈ-క్రాప్ నమోదు చేశామన్నారు. 1,030 మంది రైతులకుగాను ఇంతవరకు 161 మందికి ఈకేవైసీ చేశామన్నారు. ప్రభుత్వ పథకాలు అందాలంటే రబీ పంటలకు తప్పనిసరిగా ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి సత్యనారాయణ, రైతులు పాల్గొన్నారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం

మాడుగుల రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం జె.డి.పేటలో మంగళవారం నిర్వహించనున్నట్లు కింతలి పీహెచ్‌సీ వైద్యాధికారి కె.ఎం.నాయుడు సోమవారం తెలిపారు. రెండో దశ శిబిరాన్ని గ్రామ సచివాలయం వద్ద ఇన్‌చార్జి ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్ ప్రారంభిస్తారన్నారు. శిబిరంలో అన్ని రకాల వ్యాధులకు పరీక్షించి ఉచితంగా మందులు అందజేస్తామన్నారు.

దేవరాపల్లి: స్థానిక హైస్కూల్ ఆవరణలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు పీహెచ్‌సీ వైద్యాధికారి ఇ. పూజ్య మేఘన తెలిపారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే శిబిరానికి స్పెషలిస్టు వైద్యులు వస్తారన్నారు. వైద్య సేవలతోపాటు అన్ని రకాల పరీక్షలు, ఉచితంగా మందులు అందజేస్తామన్నారు.

మాడుగులలో అభివృద్ధి పరుగులు



దొర్లవీధిలో నూతనంగా వేసిన సీసీ రోడ్లు

- చురుగ్గా సీసీరోడ్లు, డ్రైనేజీల నిర్మాణం
- కొనసాగుతున్న జలజీవన్ మిషన్ పనులు



మాడుగుల 6వ వార్డులో నూతనంగా నిర్మిస్తున్న మంచి నీటి ట్యాంక్



నవరవీధిలో వేసిన డ్రైనేజీలు

మాడుగుల: ప్రగతి పథంలో పట్టణం దూసుకుపోతోంది. వైఎస్సార్‌సీపీ పాలన లో సంక్షేమంతో పాటు అభివృద్ధికి అధిక ప్రాధాన్యమివ్వడంతో గతంలో ఎన్నడూ లేని విధంగా మాడుగుల పట్టణం రూపురేఖలు మారుతున్నాయి. తాజాగా 5, 6 వార్డుల్లో దొర్లవీధి, నవరవీధిలో రూ.60 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేస్తున్నారు. 1,500 లీటర్ల సామర్థ్యం కలిగిన మంచినీటి ట్యాంకు నిర్మిస్తున్నారు. ఇది పూర్తయితే శాశ్వతంగా తాగునీటి ఇబ్బందులు తొలగనున్నాయి. గతంలో ఏ వీధి చూసినా మురుగునీరు దర్శనమిచ్చేది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక వీధులన్నీ సీసీ రోడ్లుగా మార్పు చెందాయి. సీసీ డ్రైనేజీలు ఏర్పాటు చేయడం వల్ల రెండు వీధుల్లో పరిశుభ్రత నెలకొంది. మాజీ ఎంపీపీ వేమవరపు రామధర్మజ, ఎంపీటీసీలు పోలిమేర విజయలక్ష్మి, కుక్కర మహేశ్వరి, సర్పంచ్ ఎడ్ల కళావతి, 16 వార్డు మెంబర్ల పర్యవేక్షణలో అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి.

మారిపోయిన రూపురేఖలు

మాడుగుల పట్టణంలో రూ.1.40 కోట్లతో సర్వాంగ సుందరంగా పీఆర్ వసతి గృహం, రూ.1.20 కోట్లతో మూడు సచివాలయాలు, రూ.80 లక్షలతో మూడు ఆర్బీకేలు, రూ.80 లక్షలతో అగ్రిల్యాబ్, కోల్డ్ స్టోరేజీ గిడ్డంగులు, రూ.5.50 కోట్లతో 30 పడకల ఆస్పత్రి నూతన భవన నిర్మాణం, తదితర అభివృద్ధి పనులు పూర్తి కావడంతో పట్టణ రూపురేఖలు మారిపోయింది. మాడుగులలో హైస్కూల్ కాలనీ, మోదమాబ కాలనీ, గణేష్, కాలనీ, జవ్వాది గెడ్డలతోపాటు కనికరమాత కాలనీ, గవరవీధుల్లో సీసీరోడ్లు, డ్రైనేజీలు రూ.6 కోట్లతో నిర్మించారు. రూ.10 కోట్లతో జలజీవన్ మిషన్ ద్వారా వచ్చే 50 ఏళ్ల వరకు తాగునీటికి ఇబ్బందులు రాకుండా ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేస్తున్నారు.

ఇంత అభివృద్ధి ఎన్నడూ చూడలేదు



మాడుగుల పట్టణంలో ఇంత అభివృద్ధి ఎన్నడూ చూడలేదు. పట్టణమంతా సీసీ రోడ్లు, డ్రైనేజీలతో కళకళలాడుతోంది. 40 ఏళ్లుగా నియోజకవర్గ కేంద్రం అభివృద్ధికి ఆమడదూరంలో ఉండిపోయింది. వైఎస్సార్‌సీపీ పాలనలో అభివృద్ధి పరుగులు తీస్తోంది.

– కుక్కర శ్రీధర్, దొర్లవీధి, మాడుగుల పట్టణం

మా కష్టాలు తీరాయి



వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత నవర, దొర్ల వీధుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేశారు. గతంలో చాలా ఇబ్బందులు పడేవారం. మా కష్టాలను గుర్తించి పరిష్కరించిన డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడుకు కృతజ్ఞతలు.

– ఎడ్ల హేమంత్‌కుమార్, మాడుగుల పట్టణం

'గడపగడప'కు విశేష స్పందన



వృద్ధురాళ్లతో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి బూడి

తురువోలులో ఇంటింటికీ వెళ్లి సమస్యలను తెలుసుకున్న డిప్యూటీ సీఎం బూడి



అంగన్‌వాడీ పిల్లలతో మాట్లాడుతున్న బూడి

చీడికాడ: తురువోలులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఇందులో భాగంగా డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సోమవారం ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పాలనకు సంబంధించిన బుక్‌లెట్లు అందించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామ సచివాలయం పరిధి రెండు గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు జీజీఎంపీ నుంచి రూ.20 లక్షలు, ఇంటింటా కుళాయిల ఏర్పాటుకు 60 వేల లీటర్ల వాటర్ ట్యాంకు నిర్మాణానికి రూ.1.80 కోట్లు కేటాయించామన్నారు. గ్రామంలో సగం ఇళ్లకు కుళాయి నీరు ఇప్పటికే అందిస్తున్నామన్నారు. గ్రామంలో దెబ్బతిన్న సీసీరోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు తయారీ చేయాలన్నారు. గ్రామ సచివాలయం పరిధిలో నాలుగున్నరేళ్లలో ప్రత్యక్ష, పరోక్షంగా 26 కోట్ల 14 లక్షల 90 వేల రూపాయలు వివిధ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరిందన్నారు. తురువోలు నుంచి బొడ్డువారి కళ్లాల వరకు 1.40 కిలోమీటర్ల మేర సీసీరోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేయాలని ఆదేశించారు. ఎస్సీ కాలనీలో కమ్యూనిటి హాల్ నిర్మాణానికి మరో రూ.5 లక్షల కేటాయించారు. తురువోలులో 548 ఎకరాల సమగ్ర భూ సర్వేకు సంబంధించి 336 రైతులకు నూతన జగనన్న భూ హక్కు పట్టాదారు పాసు పుస్తకాలను అందించారు. భవిత కేంద్రంలో ఆశ్రయం పొందుతున్న 17 మంది దివ్యాంగ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు కాకపోవడంతో ఇంటి వద్ద నుంచి భోజనం తెచ్చుకుంటూ ఇబ్బంది పడుతున్నారని ఐఈఆర్టీ ఉపాధ్యాయులు వాపోయారు. దీనికి స్పందించి డిప్యూటీ సీఎం సమస్యను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టిలో పెట్టి పథకం అమలుకు కృషి చేస్తామన్నారు. అనంతరం గ్రామంలో మూడు చోట్ల మహిళలతో కలిసి సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కురచా జయమ్మనారాయణమూర్తి, జెడ్పీటీసీ లాలం శారదాజానకీరాం, వైఎస్సార్‌సీపీ చీడికాడ, దేవరాపల్లి మండలాల అధ్యక్షులు గొల్లవిల్లి రాజుబాబు, బూరే బాబూరావు, సర్పంచ్ మట్టా అప్పారావు, ఉప సర్పంచ్ పి.టి.బాబు, చొక్కాకుల వెంకునాయుడు పాల్గొన్నారు.

'తార' స్థలాన్ని కాపాడాలని వినతి

మాకవరపాలెం: తార సంస్థకు కేటాయించిన స్థలాన్ని కాపాడాలని రుత్తల నాని సోమవారం కలెక్టరేట్‌లో జగనన్నకు చెబుదాంలో ఫిర్యాదు చేశాడు. స్థానిక బీసీ కాలనీలో తార స్వచ్ఛంద సంస్థ భవనం ఉంది. ఈ సంస్థకు 2003లో రెవెన్యూ, పంచాయతీ అధికారులు 30 సెంట్ల స్థలాన్ని కేటాయించింది. 12 ఏళ్ల క్రితం ఈ సంస్థ మూతపడిందని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ప్రస్తుతం ఈ స్థలాన్ని సంబంధం లేని వ్యక్తులు స్వాధీనం చేసుకునేందుకు చూస్తున్నారని, ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలని కోరాడు.

13న వైఎస్సార్ ఆసరా సంబరాలు



సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎంపీడీవో రాంబాబు

నాతవరం: వైఎస్సార్ ఆసరా పథకం నాలుగు విడతల్లో డ్వాక్రా మహిళలకు మొత్తం రూ.37.97 కోట్ల లబ్ధి చేకూరిందని ఎంపీడీవో జె.రాంబాబు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం వెలుగు, పంచాయతీ అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో 1,321 డ్వాక్రా సంఘాలకుగాను 14,421 మంది సభ్యులు ఉన్నారన్నారు. వీరందరికీ ఇంతవరకు మూడు విడతల్లో ఆసరా సొమ్ము బ్యాంకు ఖాతాల్లో జమ చేశామన్నారు. ప్రస్తుతం నాల్గో విడత ఆసరా కింద రూ.9.49 కోట్లకుపైగా ఈ నెల13న ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ లబ్ధిదారులకు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. వీటితోపాటు ఈ ఏడాది సకాలంలో రుణాలు చెల్లించిన డ్వాక్రా సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాలు వెంటనే అందిస్తున్నామన్నారు. మార్చిలోగా లక్ష్యాన్ని అధిగమించి రుణాలు ఇచ్చేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం మర్రి లక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

20 నుంచి దేవీతల్లి తీర్థ మహోత్సవాలు



సమావేశమైన కిలపర్తి భాస్కరరావు తదితర గ్రామ పెద్దలు

దేవరాపల్లి: గ్రామ ప్రజల ఆరాధ్య దైవం ఉమా మహేశ్వరిదేవి (దేవీతల్లి) తీర్థ, కల్యాణ మహోత్సవాలను ఈ నెల 20 నుంచి 25వ తేదీ వరకు ఘనంగా నిర్వహించేందుకు గ్రామ పెద్దలు ఏకగ్రీవంగా నిర్ణయించారు. ఈ మేరకు మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు అధ్యక్షతన సోమవారం స్థానిక దేవీ తల్లి ఆలయ ఆవరణలో గ్రామ పెద్దలు, కమిటీ సభ్యులు సమావేశమయ్యారు. ఐదో రోజు శనివారం ముగింపు తీర్థ మహోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. కార్యక్రమంలో డాక్టరు వరదపురెడ్డి సింహాచలంనాయుడు, ఎల్లేటి కరుణాకర్‌రావు, వరదపురెడ్డి లలితాప్రసాద్, గుండు రాంబాబు, గొర్లె సన్యాసినాయుడు, వాలేటి నాగరాజు, వేచలపు అప్పలనాయుడు, ఇట్లా వెంకటపతి, సోమిరెడ్డి పేరునాయుడు, దీవి శంకర్, మొల్లి కృష్ణమూర్తి, సిమ్మ అప్పన్న, సబ్బవరపు మాలిబాబు, పరవాడ రవి తదితర గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

విద్యార్థులు పరీక్షల ఒత్తిడికి గురికావొద్దు



ధ్యానంపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు జ్యోతిర్మయి, సతీష్

బుచ్చెయ్యపేట: విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా ప్రశాంత వాతావరణంలో విద్యనభ్యసించాలని వైద్యులు జ్యోతిర్మయి, సతీష్ అన్నారు. స్థానిక మెయిన్ హైస్కూల్లో విద్యార్థులకు ధ్యానంపై అవగాహన కల్పించారు. విద్యార్థులు ఏకాగ్రతను కోల్పోవద్దన్నారు. ఆందోళన చెందకుండా మానసిక స్థైర్యంతో పదో తరగతి పరీక్షలు రాయాలని సూచించారు. అర్థంకాని ప్రతి పదాన్ని ఉపాధ్యాయులతో నివృత్తి చేసుకుంటూ మంచి మార్కులు సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆస్పత్రులకు వెళ్లి పింఛన్ అందజేత



ఎన్టీఆర్ ఆస్పత్రిలో మంగమ్మకు పింఛన్ అందిస్తున్న వలంటీరు మాధవి



కేజీహెచ్‌లో రాజులమ్మకు పింఛన్ అందిస్తున్న వలంటీర్

రావికమతం: అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గోపాసిన మంగమ్మకు మేడివాడ గ్రామ వలంటీర్ మధుమంతి మాధవి సోమ వారం పింఛన్ అందించింది. మంగమ్మ అనారోగ్యంతో ఆస్పత్రిలో ఉన్నట్టు తెలుసుకుని అక్కడికి వెళ్లి పింఛన్ సొమ్ము ఇచ్చింది.

బుచ్చెయ్యపేట: విశాఖ కేజీహెచ్‌లో వృద్ధురాలు వల్లా రాజులమ్మకు వలంటీర్ తన సొంత ఖర్చులతో వెళ్లి పింఛన్ సొమ్ము అందించాడు. బంగారు మెట్టకు చెందిన ఆమె కొద్ది కాలంగా అనారోగ్యంతో చికిత్స పొందుతోంది. ఆర్థిక ఇబ్బందులు పడకూడదని గ్రామ వలంటీర్ మెల్లి అచ్చింనాయుడు సోమవారం అక్కడకు వెళ్లి పింఛన్ అందించాడు.

శరవేగంగా పేదలకు ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్

సబ్ రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు



చౌడువాడలో ఇళ్ల రిజిస్ట్రేషన్ కంప్యూటరీకరణను పరిశీలిస్తున్న వెంకటేశ్వరరావు

కె.కోటపాడు: నవరత్నాలు-పేదలందరికీ ఇళ్ల పథకంలో లబ్ధిదారులకు మంజూరు చేసిన ఇంటి పట్టాలకు సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్ చేస్తున్నట్లు సబ్ రిజిస్ట్రార్ బి.వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం చౌడువాడ సచివాలయంలో రిజిస్ట్రేషన్ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లబ్ధిదారులకు స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్, యూజర్ చార్జీలు లేకుండా ఖర్చులన్నీ ప్రభుత్వమే భరిస్తూ లబ్ధిదారులకు మేలు చేస్తుందని తెలిపారు. రిజిస్ట్రేషన్ ద్వారా సంపూర్ణ శాశ్వత హక్కులతో దస్తావేజులు లబ్ధిదారులు పొందనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో చౌడువాడ పంచాయతీ కార్యదర్శులు ఎన్.రామునాయుడు, సౌందర్య, గ్రామ రెవెన్యూ అధికారి లక్ష్మి, డిజిటల్ అసిస్టెంట్ తనూజ పాల్గొన్నారు.

450 జగనన్న స్థలాల రిజిస్ట్రేషన్ పూర్తి

మాకవరపాలెం: మండలంలో ఇప్పటివరకు జగనన్న కాలనీల్లో స్థలాలు పంపిణీ చేసిన 450 మంది లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పూర్తి చేసినట్టు ఇన్‌చార్జ్ ఎంపీడీవో జన్‌లింకన్ తెలిపారు. మండల వ్యాప్తంగా 31 పంచాయతీల పరిధిలో మొత్తం 850 స్థలాలను రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉందన్నారు. మూడు రోజులుగా 450 స్థలాలను రిజిస్ట్రేషన్ చేశామని, మిగిలినవి త్వరితగతిన పూర్తి చేసేందుకు ఆదేశాలిచ్చినట్టు తెలిపారు.

పశు బీమాతో రైతులకు ధీమా



రిజిస్ట్రేషన్ చేస్తున్న పశు వైద్య సహాయక అధికారి వరలక్ష్మి

రోలుగుంట: పశు బీమా పథకం తిరిగి అమలులోకి వచ్చిందని, రైతులు పునరుద్ధరించుకోవాలని పశు వైద్యాధికారి నూకేశ్వర్రావు కోరారు. ప్రీమియంలో 80 శాతం రాయితీతో పాడి పశువులు, దుక్కిటెద్దు, గొర్రెలు, మేకలకు మూడేళ్లపాటు బీమా సదుపాయం అవకాశం ఉందన్నారు. ఈ పథకాన్ని పాడి రైతుల శ్రేయస్సు దృష్ట్యా ప్రభుత్వం పునరుద్ధరించిందన్నారు. బీమా ప్రీమియం రూ.400 చెల్లించి పశువైద్య కేంద్రాల వద్ద సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. దీనిలో భాగంగా రోలుగుంట పశు వైద్య కేంద్రం వద్ద 40 పశువులకు పశు వైద్య సహాయకులు గణపతి, వరలక్ష్మి రిజిస్ట్రేషన్లు చేశారు.

శస్త్ర చికిత్సలకు విశాఖ తరలింపు



కె.జె.పురం నుంచి బస్సులో తరలిస్తున్న దృశ్యం

మాడుగుల రూరల్: మండలంలో రెండు గ్రామాలకు చెందిన రోగులను విశాఖ సమీపంలోని సంగినవలస అనిల్ నీరుకొండ ఆస్పత్రికి కె.జె.పురం నుంచి సోమవారం తరలించారు. స్థానిక భానోదయ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో కె.జె.పురం, వంటర్లపాలెం గ్రామాలకు చెందిన 16 మంది రోగులను వివిధ రకాల శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. వీరిని ఆస్పత్రి బస్సులో ఉచితంగా తీసుకెళ్లి, అక్కడ అవసరమైన శస్త్ర చికిత్సలు నిర్వహిస్తారని సంస్థ అధ్యక్షుడు రాపేట రామకొండలరావు తెలిపారు. కార్యక్రమంలో మళ్ల కన్నబాబు, వంటర్లపాలెం మాజీ సర్పంచ్ కుమార రాజు, సూరిశెట్టి జగదీష్ పాల్గొన్నారు.

ఘనంగా గౌరీపరమేశ్వరుల నిమజ్జనం



కొండలఅగ్రహారంలో గౌరీపరమేశ్వరుల ఊరేగింపులో గ్రామస్తులు



బుచ్చింపేటలో పూజలు చేస్తున్న భక్తులు

మాకవరపాలెం: గౌరీపరమేశ్వరుల నిమజ్జన మహోత్సవం వైభవంగా నిర్వహించారు. కొండలఅగ్రహారంలో రెండు రోజులుగా గౌరీపరమేశ్వరుల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా సోమవారం గ్రామస్తులంతా గౌరీపరమేశ్వరు ల విగ్రహాలను గ్రామ వీధుల్లోనూ ఊరేగింపు చేశారు. అనంతరం ఘనంగా నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో మండల సచివాలయాల కన్వీనర్ చిటికెల రమణ, వైఎస్సార్‌సీపీ నాయకులు పోలిరెడ్డి రమణ, ఈశ్వరరావు, చిన్న పాల్గొన్నారు.

రోలుగుంట: మండలంలో గౌరీపరమేశ్వరుల ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ ఉత్సవాలు ఆదివారం బుచ్చింపేటలో, సోమవారం కొండపాలెంలో ప్రారంభమయ్యాయి. ఆయా గ్రామాల్లో భక్తులు ఉత్సవమూర్తులకు భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. బుచ్చింపేటలో సర్పంచ్ ఉలబాల చంద్రమ్మ, ఎంపీటీసీ ఉలబాల సత్యవతి, పంచాయతీ కార్యదర్శి రామలక్ష్మి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా నేల డాన్సులు, మేళతాళాలతో బాణసంచా కాల్చుతూ గ్రామ వీధుల్లో ఉత్సవమూర్తులను ఊరేగించారు.

నేడు జేడీపేటలో ఆరోగ్య సురక్ష

మాడుగుల: జమ్మాదేవిపేటలో జగనన్న ఆరోగ్య సురక్ష -2 కార్యక్రమం మంగళవారం ఉదయం నిర్వహించనున్నట్టు కింతలి పీహెచ్‌సీ వైద్యాధికారి కె. ఎం.నాయుడు సోమవారం తెలిపారు. ఇందులో భాగంగా ప్రత్యేక వైద్య శిబిరంలో వివిధ రకాల రోగాలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తామన్నారు. స్పెషలిస్టు వైద్యులతోపాటు వైద్యులు హాజరవుతారని పేర్కొన్నారు. గ్రామ సచివాలయ పరిధిలో రోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పీహెచ్‌సీ రోగులకు మెరుగైన వైద్య సేవలు

అభివృద్ధి కమిటీ సమావేశంలో ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి



సమావేశంలో చర్చిస్తున్న ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి

నాతవరం: ప్రభుత్వం వైద్యానికి అధిక ప్రాధాన్యమిస్తుందని, దానికి అనుగుణంగా రోగులకు వైద్య సేవలందించాలని ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి తెలిపారు. వైద్యాధికారి ఎం.రాజేష్‌నాయుడు ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ముందుగా పీహెచ్‌సీలో రోగులకు అందించిన సేవలతోపాటు మందులు తదితర అంశాలను ఎంపీపీకి వివరించారు. ప్రస్తుతం కల్పించాల్సిన అత్యవసర పనులపై తెలియజేశారు. ప్రభుత్వం పీహెచ్‌సీ అభివృద్ధికి రూ.1.75 లక్షల విడుదల చేసిందని, వాటిలో సగం మరలా వెనక్కి తీసుకుందన్నారు. ఆయా నిధులతో కమిటీ అభీష్టం మేరకు పనులు చేయాల్సిందన్నారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా వసతి సమస్యతో సిబ్బంది, రోగులు ఇబ్బందులు పడేవారన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక రూ.1.65 కోట్లతో అదనపు భవనం నిర్మించి ఎమ్మెల్యే గణేష్ ఆధ్వర్యంలో డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు, మంత్రి అమర్‌నాథ్ ప్రారంభించారన్నారు. సిబ్బంది అంకిత భావంతో రోగులకు వైద్య సేవలు అందించి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. పీహెచ్‌సీలో ప్రధాన సమస్యల పరిష్కారానికి ప్రస్తుతం నిధులతో పనులు చేసేందుకు కమిటీ సభ్యులు ఆమోదించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సభ్యులు కె.వి.శరభవరం సర్పంచ్ శంకపల్లి చింతల్లి, పీహెచ్‌సీ సీనియర్ అసిస్టెంటు శ్రీనివాసరావు, ఎంపీహెచ్‌వోలు కొరుప్రోలు వెంకటరమణ, పోలుపర్తి భైరాగి, సిబ్బంది పాల్గొన్నారు.